క్లుప్తంగా

అక్రమ నిర్మాణాల తొలగింపు



షట్టర్లను జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నుంచి సుచిత్రకు వెళ్లే దారిలో జీన్స్ ఫ్యాక్టరీ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఏర్పాటు చేసిన షట్టర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు కూల్చివేయించారు. గతంలో ఈ అక్రమ నిర్మాణాలపై పలు ఫిర్యాదులు రాగా దీనిపై స్పందించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం జేసీబీతో షట్టర్లను నేలమట్టం చేశారు. మరోసారి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మాణదారులను అధికారులు హెచ్చరించారు.

ముగ్గురు వ్యక్తులపై వీధి కుక్క దాడి



కుక్క కరవడంతో అశోక్ చేతికి అయిన గాయం

సుభాష్‌నగర్: రెండు రోజుల క్రితం మల్లారెడ్డినగర్‌లో ఓ బాలికపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మరువక ముందే శనివారం మరో ఘటన చోటుచేసుకుంది. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని మరో ముగ్గురిపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కైసర్‌నగర్‌కు చెందిన అశోక్ (43) ఉదయం నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. అదే కుక్క అటుగా వెళ్తున్న మరో ఇద్దరిపై దాడి చేసింది.

చిరు వ్యాపారుల జీవనోపాధిని కాపాడండి



కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్ రైతు బజారు వద్ద డివైడర్లను తొలగించాలని కోరుతూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. డివైడర్ సమస్యతో రైతు బజారు ఎదుట చిరు వ్యాపారుల బతుకులు రోడ్డున పడుతున్నాయని, ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కూరగాయలు, పండ్లు విక్రయించే వారికి ప్రధాన సమస్యగా ఉన్న డివైడర్‌ను తొలగించి వారి జీవనోపాధిని కాపాడాలని ఆయన సర్కిల్, ట్రాఫిక్ అధికారులను కోరారు. కార్యక్రమంలో షాపూర్‌నగర్ రైతు బజార్ చిరు వ్యాపారుల సంఘం ప్రతినిధులు నాగేశ్వరరావు, అమరావతి నాగమణి, ప్రకాష్, వాహెద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం బీజేపీ నాయకులు కమిషనర్ శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ జిల్లా కార్యాలయం ఇన్‌చార్జ్ శివాజీరాజు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 4, 8, 12, 13 వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. ఎన్సీఎల్ కాలనీ నుంచి నోబుల్ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే దారిలో డ్రైనేజీ లైన్ కోసం రోడ్డు తవ్వి సంవత్సరం పూర్తయినా పునరుద్ధరించడం లేదని, ఈ విషయమై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ శ్రీహరి మాట్లాడుతూ.. ఎన్సీఎల్ నుంచి నోబుల్ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రోడ్డుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయిందని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారం రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. మహిళా మోర్చా అధికార ప్రతినిధి మాధురి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీఎస్ శాంతి కుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడారు.కలెక్టర్ అమయ్ మాట్లాడుతూ జీవో 58 ,59ప్రకారం అర్హులైన వారిని గుర్తించడంతో పాటు వారికి పట్టాలను ప్రజాప్రతినిధుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు
- పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు
- ఒక్కో సెంటర్‌లో 12 మంది ఇన్విజిలేటర్లు
- మొత్తం 50 సెంటర్లలో 600 మందితో పర్యవేక్షణ
- సమయానికి ముందే చేరుకోవాలని విద్యార్థులకు సూచన



హాల్ టికెట్లు చూపిస్తున్న పదో తరగతి విద్యార్థులు

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 21 ప్రభుత్వ పాఠశాలల్లో 1764 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 9,482 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులకు అనువుగా ఉండే పాఠశాలలనే పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి జరిగే పరీక్షల కోసం అధికారులు సన్నద్ధమయ్యారు. గతంలో 11పేపర్లు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్యను 6పేపర్లకు కుదించిన విషయం విదితమే.

కేంద్రాల్లో అన్ని సదుపాయాలు..

ఎంపిక చేసిన కేంద్రాల్లో ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గాలి వెలుతురు సక్రమంగా ఉండే తరగతి గదులను ఎంపిక చేశారు. వీటికి తోడు ఆయా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు అందుబాటులో ఉంచారు. ఒక్కో పరీక్ష కేంద్రంలో 200 నుంచి 220 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. ఒక తరగతి గదిలో 20 మంది, బెంచికి ఇద్దరు చొప్పున కేటాయించారు.

గతంలో మాదిరిగానే..

- గతంలో మాదిరాగే ఈ సంవత్సరం కూడా జంబ్లింగ్ పద్ధతిని కొనసాగించనున్నారు.
- ఒక పాఠశాల విద్యార్థులు మరో పాఠశాలలో పరిక్షలు రాయాల్సి ఉంటుంది.
- విద్యార్థి చదువుతున్న పాఠశాలలకు 3 కి.మీ. పరిధిలో పరిక్ష కేంద్రాన్ని కేటాయించి పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు సూచనలు ఇవే..

- విద్యార్థులు ఒక రోజు ముందే పరీక్ష కేంద్రాన్ని చూసుకుంటే ఇబ్బందులు ఉండవు. దీంతో పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోగలుగతారు.
- పరీక్ష సమయానికి 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతించారు. పరీక్ష కేంద్రానికి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించమని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పరీక్ష కేంద్రాల్లో నిరంతర నిఘా..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 50 పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక అధికారులను నియమించారు. 50 మంది చీఫ్ సూపరింటెంట్లు, 50 మంది డిపార్టమెంట్ అధికారులు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు వీటిని పర్యవేక్షిస్తారు. ఒక్కో సెంటర్‌లో 12 మంది ఇన్విజిలేటర్లు చొప్పున 600 మంది విధులు నిర్వర్తించనున్నారు. నియోజకరవ్గంలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. అన్ని కేంద్రాల్లో పోలీసు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. అదే విధంగా ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల

అన్ని చర్యలు తీసుకున్నాం..



పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఎగ్జామ్ సెంటర్ల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు సకాలంలో కేంద్రానికి చేరుకోవాలి. మా సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తారు.

– అంజనేయులు, మండల విద్యాధికారి

నేడు మెగా జాబ్ మేళా

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 10 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సుమారు 108 కంపెనీలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. కూకట్‌పల్లిలోని మెట్రో ట్రక్ పార్కు వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా ఉంటుందన్నారు. పదవ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.6.11 లక్షలు విరాళం

గచ్చిబౌలి: కొత్తగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.6.11 లక్షలు విరాళంగా అందజేశారు. విద్యుత్ పెండింగ్ బిల్లులు, ఫ్యాన్లు, బల్బుల ఏర్పాటుకు మారీటెక్ ఫౌండేషన్, రక్షపు సందీప్ గౌడ్ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మా ఊరి పాఠశాలను మేమే అభివృద్ధి చేసుకుంటామనే లక్ష్యంతో మరి కొందరు దాతలు ముందుకు రావడం అభినందనీయమని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి శుశీందర్ పేర్కొన్నారు. బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాతవ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య, రక్షపు కృష్ణ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు మల్లారెడ్డి కాలేజ్ కృషి



మల్లారెడ్డిని సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

సుభాష్‌నగర్: మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు పొందిన 1600 మంది విద్యార్థులకు ఇనిస్టిట్యూట్ టు కార్పొరేట్ పేరిట విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి మట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నత భవితకు మల్లారెడ్డి కాలేజ్ కృషి చేస్తోందని, ఇప్పటి వరకు వేలాది మంది విద్యార్థులు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు. మల్లారెడ్డి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సాధించిన విజయాల వెనుక అధ్యాపకుల పాత్ర ఎంతో ఉంటుందని, అదే వారి బంగారు భవితకు బాటలు వేస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, డీన్ వేణుగోపాల్, ప్రొఫెసర్ కైలాస రావు, ఏవో రాజేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ కిరణ్, ప్లేస్‌మెంట్స్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్ సుభాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానవీయ విలువలు అలవర్చుకోవాలి



జీడిమెట్ల: విద్యార్థులు చదువుతో పాటు మానవతా విలువలను అలవర్చుకోవాలని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ మండవ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.ఈ సందర్భంగా ఉన్నత తరగతులకు ప్రమోట్ అయిన విద్యార్థులకు పట్టాలతో పాటు సరిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు సమాజం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'బీసీలు కేసీఆర్‌కు బుద్ధి చెప్పడం ఖాయం'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

నిజాంపేట్: కేసీఆర్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న మోసం మర్చిపోలేనిదని, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా కేసీఆర్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. ప్రగతినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంటింటికి ఓబీసీ మోర్చా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీలందరూ కేసీఆర్ చేస్తున్న అన్యాయాలను గుర్తించారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మధన్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు అంజనేయులుగౌడ్, అమలేశ్వరి, పార్లమెంట్ కో కన్వీనర్ డా.రాజు, విష్ణువర్ధన్, శ్రీనివాస్, భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సతీష్‌రెడ్డి తదితరులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ రక్షణ శాఖామాత్యుల సాంకేతిక సలహాదారుడు డాక్టర్ సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన, నవకల్పనలపై దృష్టి సారించాలన్నారు. దేశ భవిష్యత్ ప్రణాళికలకు అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి విద్యా సంస్థలు పునాది వేస్తున్నాయన్నారు. అనంతరం కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి సురేశ్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత ఉన్నతికి ఎదిగినా తాము పుట్టి పెరిగిన పల్లెటూర్లను మరువరాదని, వాటి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి జె.శేషగిరిరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి



గర్భిణులకు కోడి గుడ్లు అందజేస్తున్న కార్పొరేటర్

నిజాంపేట్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తోందని నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం బాచుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆయన కోడిగుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ సత్తిరెడ్డి, రాజేందర్ రెడ్డి, అంగన్వాడీ పాఠశాల సూపర్‌వైజర్ రేణుక, అంగన్వాడీ పాఠశాల ఉపాధ్యాయురాలు మణిమాల, మాధవి ఇతరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి అన్నారు. బాచుపల్లి 18వ వార్డులోని శ్రీ హోమ్స్ కాలనీలో శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా తదితర సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఇదే తరహాలో అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీహోమ్స్ కాలనీ అధ్యక్షుడు రవికుమార్, విజయ్, రామోజీ, శశి, బాలాజీ, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, రాంరెడ్డి, ప్రదీప్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సేవలు ఎనలేనివి

మేడ్చల్ రూరల్: చిన్నారులు, గర్భిణులకు పోషకాహార అందించి వారికి అనారోగ్య ముప్పు తొలగించడంతో ఐసీడీఎస్ ముందువరుసలో ఉంటుందని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాములు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవం నిర్వహించి మహిళలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

కలెక్టరేట్‌లో తాగునీటి సదుపాయం

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో తాగునీటి సదుపాయం కల్పించడం ఎంతో ఆనందకంగా ఉందని,దీనికి సహకరించిన దాతలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియచేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ (సీఎస్ఆర్) కింద కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.1.60 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)అభిషేక్ ఆగస్త్య , డీఆర్‌ఓ లింగ్యానాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆలయాలనికి విరాళం అందజేస్తున్న మెగా ఇంజనీరింగ్ గ్యాస్ ప్రతినిధి

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని రామభక్త ఆంజనేయ స్వామి ఆలయానికి మెగా ఇంజనీరింగ్ గ్యాస్ సంస్థ రూ. లక్ష విరాళం అందజేసింది. శనివారం సంస్థ ప్రతినిధి సాయికృష్ణ ఆలయంలో పూజలు నిర్వహించి రూ. లక్ష నగదును గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తాం



సంజయ్ గాంధీనగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం ప్రగతియాత్రలో భాగంగా రంగారెడ్డినగర్ డివిజన్‌లోని జీశన్ బస్తీ, దావూద్ బస్తీ, సంజయ్ గాంధీనగర్‌లలో కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వారు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జీశన్ బస్తీ (నెహ్రూనగర్)లో రూ.86 లక్షలతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, స్మశానవాటిక.. దావూద్ బస్తీ (నెహ్రూ నగర్)లో రూ.1.5 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్లు, ముస్లిం స్మశానవాటిక.. సంజయ్ గాంధీనగర్‌లో రూ.2.39 కోట్లతో ప్రధాన రోడ్డు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి లైన్ల వంటి అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయరాం, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, మాజీ అధ్యక్షుడు గౌసుద్దీన్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, డీఈఈ భానుచందర్, ఏఈ మల్లారెడ్డి, మేనేజర్ పూజ, కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తుల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, బుల్లెట్ వాహనం

దుండిగల్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను దుండిగల్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ డీసీపీ ఆనంద్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. బొల్లారం గ్రామానికి చెందిన ధరమ్‌రాజ్(26) విశాఖపట్నం పాడేరులో ఉండే సిద్దు అనే వ్యక్తి నుంచి 6.4 కిలోల గంజాయి తీసుకువచ్చాడు. శనివారం మధ్యాహ్నం గండిమైసమ్మ చౌరస్తాలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద దేవరయాంజాల్‌కు చెందిన ఆనంద్ అనే వ్యక్తికి గంజాయి ఇచ్చేందుకు వెళ్లాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు దుండిగల్ ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ధరమ్‌రాజ్, ఆనంద్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల విలువ చేసే 6.4 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, బుల్లెట్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. వారిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రమణారెడ్డి, మేడ్చల్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, సిబ్బందిని డీసీపీ ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు.